# వింత ప్రవర్తన వెనుక—

"వల్లపురెడ్డి"

కథానిక

నిత్యమూ కళాశాల వదలిన తరువాత ఇంటికి వచ్చి, టిఫినూ కాఫీ పుచ్చుకునే వరకూ నేను మనిషిగా ఉండనసలు. ఆకలితో నకనకలాడుతున్న వాడు సామాన్యంగా ఏ ఇతర విషయాన్ని గురించీ ఆలోచించలేడు. ఇతరులు తనతోగాని, తనను గురించి ఇతరులతోగాని ఏపాటి అస్తవ్యస్తంగా మాట్లాడినా దుర్వాసుడై పోతాడు. ఆ సమయంలో ప్రాణమిత్రుడొచ్చి ఆప్యాయంగా భుజం తట్టినాసరే, వాడితో వాగ్యుద్ధమో, చేతనైతే ముష్టియుద్ధమో అకారణ కారణాన్ని కల్పించుకుని చేయడానికి సంసిద్ధుడౌతాడు.

రోజులాగే ఆనాడూ నాలుగ్గంటలకి కళాశాల వదలిన తరువాత మదీనా బిల్డింగు దగ్గరి బస్సుస్టాప్ దగ్గరికి ఆయాసంతో నడిచివచ్చి, అప్పుడే కదలటానికి సిద్ధంగా ఉన్న ఎనిమిదో రూటు బస్సులో ఎక్కాను. అదేమి ప్రకృతో తెలీదుకాని, బస్సులో ఎక్కే ప్రతివ్యక్తి కిటికీకి దగ్గరగా కూర్చోడాన్ని వాంఛిస్తాడు. బస్సు పరుగెడుతుంటే తమాషాగా బయటి దృశ్యాలను అవలోకించడమే వాళ్ళ ఉద్దేశమై ఉంటుంది. ఈ కారణంచేతనే కాబోలు, బస్సు పైభాగంలో ఇద్దరేసి కూర్చునే సీట్లు వరుసగా అమర్చిఉన్నా, ఒక్కరొక్కరే కిటికీలకి చేరువగా కూర్చుని బయటికి తలల్ని నిక్కించి చూస్తున్నారు. నాక్కూడా అందరికీ సహజమైన వాంఛ ఉండబట్టి నేనూ అలాంటి చోటుకొఱకే ప్రయత్నించాను. ముందరి భాగంలో ఒకే ఒక్క సీటు మిగిలిఉంది. నేను త్వరత్వరగా వెళ్ళి ఆ చోటుని ఆక్రమించాను. నా వెనకాలే పరుగిడుతూ వచ్చి బస్సునెక్కిన ఒక వ్యక్తి అదే సీటుకొఱకు వచ్చాడేమో, నేనా సీటుమీద కూర్చోవడంచేత విధిలేక, — ఒక విధంగా ఆశాహతుడై అనుకుంటాను—నా ప్రక్కనే ఉపవిష్టుడయ్యాడు.

బస్సు వెడుతోంది. కండక్టరువచ్చి డబ్బు పుచ్చుకుని టికెట్టు ఇచ్చిపోయాడు. మూసీ నది వంతెన మీదుగా బస్సు వెడుతున్నప్పుడు నదిలో అల్లంత దూరాన అగుపడుతున్న బట్టల నుదికే ధావక ప్రవరుల దృశ్యాలు ఒకవిధంగా తృప్తినిచ్చినా వంతెన దాటడంతోనే బయటికి చూడ మనస్కొప్పలేదు. ఆనాడు ఆఖరు పీరియడులో కెమిస్ట్రీ లెక్చరర్ బోధించిన "పిరియాడిక్" లా పూర్తిగా అర్థంకాలేదు. దానికి కారణం నా కుక్షిలో రగిలిన బాధే. బస్సు నా గమ్యస్థానం చేరుకోవడానికింకో ఇరవై నిముషాలు పడుతుంది నీసం. అంతదాకా కెమిస్ట్రీ పుస్తకంలో ఆవేళ అర్థమవని ప్రకరణాన్ని సమీక్షిద్దామని పుస్తకాలని తడుముకున్నాను. అన్నిటికంటే పైన, నేను కళాశాల విశ్రాంతి సమయంలో చదువుకుందామని తెచ్చుకున్న నవల అగుపడింది. ఆ స్థితిలో కెమిస్ట్రీ తలకెక్కడం అసంభవమని తోచి నవలనే పట్టుకున్నాను శేషభాగాన్ని పూరించటానికి.

ఇంకా ఒక పుటకూడా సరిగా చదవలేదు, అప్పుడే నా ఎడం ప్రక్కనుంచి అగ్గిపుల్ల వెలిగించిన గంధకపు వాసనవచ్చి నేరుగా నాసికారంధ్రాల్లో దూరి ఉక్కిరి బిక్కిరి పరచింది. నాకంతులేని కోపం వచ్చింది. బస్సులో 'Smoking is prohibited' అని స్పష్టంగా రాసిఉన్నా, తన్నిషేధ కార్యారంభం సాగించిన ఘనుడెవరా అంటూ ప్రక్కకి చూపు నిగుడ్చాను. ఇంకెవరు? నా ప్రక్కన ఆసీనుడైఉన్న ఆ శ్రీవారే! స్పెషలు చార్మినారు సిగరెట్టు అంటించి రైలు ఇంజనులాగా బుగబుగ పొగవదుల్తూ అగ్గిపెట్టెనీ,

సిగరెట్టు డబ్బీని జేబులో దోపుకుంటున్నాడు. వేషాన్నిబట్టి చూస్తే గొప్పగా చదువుకున్న వాడి లాగున్నాడు. ఆమాత్రం తెలియక పోయిందా అని అసహ్యించుకున్నాను. అంతేగాని అతణ్ణి సిగరెట్టు త్రాగడం శాసన విరుద్ధం—ముఖ్యంగా తోటి ప్రయాణీకులకి ఇబ్బంది—అని మందలించ లేక పోయాను. ఎవడో అమాయకుడు, చదువు రానివాడు చేస్తే తెలియ చెప్పొచ్చు. ఒక రౌడీ ఆ పనిచేస్తే బలవంతంగా మాన్పించవచ్చు; కాని చేతిలో పెద్దపెద్ద పుస్తకాలు పట్టుకుని సూటూ బూటూ వేసుకుని నలుగురి దృష్టికీ గౌరవస్తుడులా అగుపడే 'పెద్దమనిషి'ని ఎలా మందలించడం? తెలిసిన మూర్ఖుడికి ఎలా చెప్పడం? అతని బాధ్యతా రహితమైన ప్రవర్తనకి చిరాకెత్తి, కళ్లెఱ్ఱజేసి న్యూన భావంతో అతని ముఖంలోకి చూస్తూ కన్బొమలు ముడిచాను. నా చర్య అతణ్ణి ఈషత్తయినా స్పర్శించలేదు. అతడు యథాలాపంగా పొగవదుల్తూ ప్రక్కన ఒక సహ ప్రయాణీకుడికి ఇబ్బంది కలుగుతుంది కదా అని గమనించి నాకేసి చూడకండానే తాను వదుల్తూన్న పొగని వలయాలుగా మార్చ ప్రయత్నిస్తున్నాడు. అసలే క్షుద్బాధాపీడితుడిని కావడంవల్ల సహజంగా రావాల్సిన కోపం కంటే నాలుగురెట్లెక్కువగానే వచ్చింది. కాని ఏం చెయ్యను? ఇక గత్యంతరంలేక జేబు రుమాలు తీసి ముక్కుకు అడ్డంపెట్టి పుస్తకాలమీద మోచేతుల్ని మోపి అరమోడ్పు కనులతో కూర్చున్నాను.

బస్సు రెండుచోట్ల ఆగినట్లు ఫీలయాను. కాని ఎందరు దిగివెళ్ళారో, ఎందరు కొత్తగా ఎక్కి కూర్చున్నారో చూడలేదు. కొంచెంసేపు గడిచిన తరువాత నాచేతుల క్రింద నుంచి పుస్తకాన్ని ఎవరో మెల్లిగా లాగుతున్నట్లు అనుమానం కలిగింది. తక్షణం బస్సులో "దొంగలున్నారు జాగ్రత్త!" అని వ్రాసి ఉంచిన బోర్డు సంగతి జ్ఞాపకం వచ్చింది. విద్యుద్ఘాతం తగిలిందానిలాగా నా తల పక్కకి తిరిగింది—ఇందాక నా అంచున కూచునివున్న పెద్దమనిషి జేబుదొంగ కావచ్చు నన్న సందేహంతో. కాని ఆ వైపు చూసేసరికి నా కంతకుపూర్వం ఉన్న క్షుద్బాధా, ప్రక్కన ఉపవిష్టుడైన పెద్దమనిషిమీద కలిగిన కోపమూ, ఎవరో దొంగ నా పుస్తకాన్ని కొట్టేస్తున్నాడనే అనుమానమూ అన్నీ ఒక్కసారిగా గాలి తాకిడికి చిద్రుపలుగా విడిపోయి మాయమైపోయే పల్చని, తెల్లని మేఘ శకలాల్లాగు అదృశ్యమైనాయి.

నా కాశ్చర్యం వేసింది. అందాకా నాప్రక్కని కూర్చున్న వ్యక్తి లేదు. ఎక్కడ దిగిపోయేడో తెలీదు. ఆయనస్థానే ఒక మత్తకాశిని అగుపించింది. సినిమాలో విష్ణువు మోహినీరూపం ధరించినట్లు, అందాకటి పెద్దమనిషి గాని ఈ సుందరి రూపమెత్తలేదు గదా, అనిపించింది ఒక క్షణ మాత్రం. కలికాలంలో ఇలాంటిది జరగడం నమ్మరాని సంగతిగా తోచడంతోనే ఆ సందేహం నిలువకండా పారిపోయింది. నే నామెకేసి చూస్తున్నాను. ఆమె వయస్సు ఇరవైకి సమీపిస్తున్నట్లు ఉంది. నువ్వుపువ్వులాంటి ముక్కూ, ఉత్పల దళాల్లాంటి నేత్రాలూ, ఎక్కువెట్టిన విల్లులాంటి కన్బొమలతీరూ ఆమె అందానికి కొలబద్దలు. తెల్లని సిల్కుచీరా, మోచేతులవరకూ బిగువుగావున్న లేత పసుపురంగు రవికె ఆమె మెయి మెరుపునూ, యౌవనాన్నీ దాచినై. ఆమె సౌందర్యాన్ని వర్ణించడానికి నా దగ్గర అనువైన శబ్దజాలం లేదు.

ఆమె నా కళ్ళలోనికి సూటిగాచూస్తూ పుస్తకాన్ని లాగుతూంది. పుస్తకాలపైని ఉన్న నా మోచేతుల బరువుని అప్రయత్నంగా తొలగించాను. ఆమె చిరునవ్వుతూ పుస్తకాన్ని తీసుకుంది. మా వైపు ఎవరైనా చూస్తున్నారేమోనని వెనక్కితిరిగి చూశాను. సీట్లన్నీ నిండి ఉన్నయి. ఎక్కడా ప్రత్యేకమైన చోటు దొరక్కపోబట్టి ఇక్కడ కూర్చున్నది, ఎవరో ఈమె అనుకున్నాను. బస్సులో అందరూ మామూలుగానే ఉన్నారు; మమ్మల్ని అదో మాదిరి దృష్టితో ఎవరూ చూడ్డంలేదని పించింది. ఆమెను మళ్ళీ చూడ బుద్ధేసింది. ప్రసన్నంగా, పూర్ణిమా చంద్రబింబంలా ఉన్న మందహాసం తొంగిచూసే వదనంలోని కాంతిపుంజాల్లాంటి కళ్ళతో అవలోకిస్తూ ఆమె పుస్తకంమీద చిత్రించి ఉన్న పుస్తక నామాన్ని చూసి, చదివింది కాబోలు, నాకేసి చూసి అదో విధంగా నవ్వింది. అది నేను తెచ్చుకున్న నవల—'హృదయేశ్వరి.' నాకేదో భావం స్ఫురించి సిగ్గుతో తలవంచుకున్నాను. ఆమె సిగ్గుపడాల్సిన అవసరం ఏమీ

లేదన్నట్లు మార్చింది ముఖకవళికను. నేనూ మంద హాసం చేయకుండా ఉండలేక పోయాను.

బస్సు అబిడ్ రోడ్డులో ఆగింది. జనసమ్మర్దం ఎక్కువగా ఉన్నందున త్వరగా కదిలింది.

"కాలేజీనుంచి వస్తున్నారా?"—మృదువుగా, గౌరవంగా ప్రశ్నించిందామె. వెనకనుంచి వచ్చిన గాలికి ముంగురులు చెదిరి నుదుటిమీదా, చెక్కిళ్ళ మీదా కదిలినయి.

ఆమె ఇంత చనువుగా ప్రశ్నించేసరికి నేను స్తబ్ధుణ్ణయిపోయాను. "అవును."— వీలయినంత తియ్యందనము గొంతులోంచి రానిచ్చాను.

"ఎక్కడుంటున్నారు?"— రెప్పలార్పుతూ అడిగిందామె.

ఆమె ఎంతో దగ్గరి వ్యక్తిలా నా వివరాలు కనుక్కుంటూంటే నా ఆశ్చర్యానికి మేరలేక పోయింది. ఆమె ఎవరో తెలుసుకుందామను కున్నాను. కాని ప్రశ్నించటానికి వీలు చిక్కలేదు. ఆమెనలా పృచ్ఛించడం నేనామె కివ్వాల్సిన గౌరవానికి భంగంగా తోచింది. ఎవరో మాకు దూరపు బంధువుల్లో ఒకామె అయి వుంటుందను కున్నాను. నేను మతిమరుపు మనుష్యుల్లో ప్రథమ గణానికి చెందుతాను. కేవలం ఒకటి రెండు సార్ల పరిచయంతోనే ఒక వ్యక్తిని జ్ఞాపకముంచుకోవడం నాకు సాధ్యపడదు. పూర్వం ఒకామె ఇలాగే రైల్వేస్టేషనులో కలిసి మా చెల్లాయిని గురించీ, అమ్మానాన్నల సంక్షేమాన్ని గురించీ, ప్రకృతం నే నెక్కడ చదువుతున్నదీ తెలిసికుంది నాతో చాలా సన్నిహితంగా మాట్లాడి. కాని నా కామె ఎవరో తెలీదు. నా కుండుకున్న ప్రకృతి సిద్ధమైన స్వభావం నన్ను ప్రశ్నించనివ్వలేదు. ఇంటికివచ్చి చెల్లాయికి ఆమె రూపురేఖల్ని వర్ణించి చెప్పి, ఆమె ఎక్కణ్ణుంచి ఎక్కడిదాకా ప్రయాణం చేసింది కూడా చెబితే ఆమె 'ఫలానా' అని తెలిసింది. అప్పుడు 'ఓహో!' అనుకున్నాను. ఇలాంటి ఘట్టాలు నా జీవితంలో మామూలుగా జరుగుతూ వచ్చినై. కనుకనే ఆమెను నేనేమీ వివరాలడుగలేదు. ఆమె ప్రశ్నకి "ఖైరతాబాద్‌లో ఉంటున్నాను."అని సమాధానం మాత్రం చెప్పాను.

"అద్దె ఇంట్లోనా?"

'అవును.'

"భోజనం?"

"స్వయంపాకం."

స్వయంగా వండుకుంటున్నాననగానే 'చాలా కష్టపడుతున్నారు.' అనే భావం స్ఫురించేటట్లుగా 'చ్ చ్' అని పూర్ణానుస్వారంలా చుట్టిన మూతితో ధ్వనిచేసి "పెళ్ళిచేసుకోండి; చేయి కాల్చుకోవడం తప్పుతుంది."—అంది. ఆమె చిలిపిగా నవ్వింది. ఆ నవ్వుతరంగాలు నాలో నునుసిగ్గును రేకెత్తించినై.

"ఆఁ—"నేను క్లుప్తంగా సమాధానమిస్తున్నాను; మేమింత చనువుగా మాట్లాడుకోవడం ఎవరైనా చూస్తే దురభిప్రాయ పడతారేమోనన్న శంకా పీతుడినై. కాని ఆమె అంతకంతకు సాన్నిహిత్యంగా మాట్లాడసాగింది.

"అన్నగారు బాగున్నారా?"

ఈ ప్రశ్నవినగానే నాలో పూర్వస్మృతులు వీచినై. నాల్గు వత్సరాలక్రిందట చూసిన అన్నగారి శవం కన్నుల్లో కదిలింది. దుఃఖంవచ్చేసింది. "లేదు; చనిపోయారు."—అన్నాను గొంతులోనే.

"అబ్బా!" ఆమె నిర్మలవదనమూ విషాదవగుంఠితమైపోయింది.

"కాదు; ఆత్మహత్య."—చెమ్మగిలిన కళ్ళను కిటికీ కభిముఖమై జేబు రుమాలుతో వత్తుకున్నాను.

క్షణం తరువాత ఆమెకేసి తిరిగాను. ఆమె ముఖద్యుతిలో చీకటిరేఖ ప్రాకినట్లుంది. అస్మత్ భ్రాతృ మరణ విషాద వృత్తాంత మామె మనో ప్రసవంలో శూలంలా గ్రుచ్చుకుంది కాబోలు. 'ఏమో లెండి! విధి' అని ఆమెని ఓదార్చుదామను కున్నాను. కాని అంత పనీ చెయ్యలేక పోయాను. సానుభూతి, అనుకంపలతో నిండిన మా సంభాషణని ఎవరేనా వింటున్నారేమోనని సహప్రయాణీకులను మరోసారి కలయచూశాను. ఈసారి కొందరు మాకేసి—ప్రత్యేకంగా నాకేసి—చూస్తున్నట్లుగానే అగుపడింది. ముఖ్యంగా నాకు వెనక సీటులో వామపార్శ్వాన కూర్చున్న ఒక నడి వయసు వ్యక్తీ, ఆయన ప్రక్కనే అవతలివరుస సీటులో ఇవతలి వైపు కూర్చున్న ఒక స్త్రీ మూర్తీ నన్ను అదేపనిగా వీక్షిస్తున్నట్లు తోచింది. వారిరువురి నయనాల్లో దాదాపు సమభావమే ద్యోతకమవుతూంది. వాళ్ల నా ప్రక్కని కూర్చుని నాతో ప్రసంగిస్తున్న దివ్యసుందర విగ్రహం తాలూకు

వాళ్ళయి ఉండొచ్చు ననిపించింది. నడివయసులో ఉన్న పురుషమూర్తిలో కించిత్ ఆగ్రహ లక్షణా లున్నా, విషాదాచ్ఛన్నమై ఉందతని ముఖం. 'నే నేమీ అసభ్యంగా ప్రవర్తించడంలేదు. నామీద కోప్పడటానికెవరికీ నిమిత్తంలేదు.' అని మనస్సులో తీర్మానించుకుని ఆమెవైపు తిరిగాను.

ఆమె వదనంలో అప్పటికి కొంత దైన్యభావం తగ్గింది. "వదినా, పిల్లలూ క్షేమమేననుకుంటాను." అంటూ నా దగ్గర తీసుకున్న పుస్తకాన్ని ఊరువులపై నిడుకుంది. ముఖం మబ్బుల తెరలనుదాటి వచ్చిన చంద్రబింబంలా మారినా, ధ్వనిలో కొంచెం గాద్గదికత బయల్పడింది.

"అబ్బాయి చనిపోయాడు జబ్బుచేసి." హీన స్వరంలో జవాబిచ్చాను.

"పాపం! వంశాంకురం నిలబెట్టడానికైనా కరువయ్యాడే!" అని వాపోయింది. చాలామంది నాతో ఈ మాటే అన్నారు. ఈ మాట విన్నప్పుడల్లా నా బరువైన హృదయంలోంచి ఒక వేడి నిట్టూర్పు తప్పితే మరేమీ రాలేదు.

"అన్నీ మనం అనుకున్నట్లు జరగాలంటే జరుగుతాయా!" అన్నాను వేదాంత ధోరణిలో. "అవును జరగవు." అందామె మెల్లిగా.

కొంత తడవు పరస్పరావలోకనమే సరిపోయింది. తన మనస్సులో ఆమె ఏమనుకుంటూందో తెలీదు. కాని నామట్టుకి నేను ఆమె చాలా మంచి మనిషి అని అభిప్రాయపడ్డాను. నేనలా అభిప్రాయపడటానికి కారణం ఆమె మాటల్లో ఉన్న ఆప్యాయతా, నమ్రతా మినహాయిస్తే మరొకటికాదు.

నే నామె నేమీ ప్రశ్నించే స్థితిలో లేను. కాస్సేపు మాట్లాడి ఉంటే బావుండు ననిపించింది మనస్సుకి. అనిపించడమే తడవుగా నా అభీష్టం నెరవేరింది. "మరి, అమ్మా నాన్నల సంగతి చెప్పారు కారు! క్షేమమా?" ఇంతటి ముఖ్యమైన విషయాన్ని అడక్కుండా మర్చిపోయానన్న విచారం ఆమె ప్రశ్నలో ప్రతిధ్వనించింది.

"క్రితం వేసవిలో నాన్నగారు పోయారు."

"అబ్బా! ఏమిటండీ, నా కన్నీ విషాద వార్తలే చెబుతున్నారు?"—ఆమె ముఖం దాదాపు ఏడుస్తున్నదానిలా పరివర్తనం చెందింది. ఆమె వేస్తున్న ప్రశ్నలన్నీ నాలో పూర్వ స్మృతుల్ని రగిల్చి, నన్ను విచారసాగరంలో ముంచేవిగానే ఉన్నవి. గతించిన వాళ్ళందరూ జ్ఞాపకానికి రావడంవల్ల నాలో రేగుతున్న తుఫానును అణచుకుంటూ బహుప్రయాసతో ఆమెకు జవాబిస్తూవచ్చాను. ఈ మాటలు విన్నాక, ఇకముందామె అడిగిందానికి జవాబివ్వాలా వద్దా అనే ద్వంద్వంలో పడిపోయాను. నేను నిరుత్తరుడినై కూర్చుంటే ఆమెకసంతృప్తి. ప్రత్యుత్తరమిస్తే ఆమెకి బాధ. గత విశాద దృశ్యాలు స్మృతిపథంలో అవతరిస్తే నాలోనూ తీరని బాధ సముద్భూత మౌతుంది. నా బాధని నేనెలాగైనా ఓర్చుకోగలను. కాని ఆమె సుకుమార హృదయం అనుభవించే వేదనను ఎలా సహించగలుగుతాను? నా హృదయం పూర్తిగా ఆమెవైపు మొగ్గిపోయింది. ఆమె నా కేసి తదేకంగా చూస్తోంది.

"అది నా దురదృష్టం. మీ కొక్క సంతోష వార్తనైనా చెప్పలేకపోతున్నాను" అంటూ ఖిన్న వదనంతో ప్రత్యుత్తర మిచ్చాను.

"మరేం విచారించకండి. జరిగేదేదో జరిగిపోతూంటుంది. దానికి మీరూ, నేనూ విచారించి ఏం చెయ్యగలుగుతాం?...అయితే, చెల్లాయి సంగతేమిటంటారు?" అని ప్రశ్నించింది. నేను సమాధానం చెప్పబోతుండగానే "ఇందాకటి సమాధానాల్లాంటిదే అయితే ఇక వద్దు." అంటూ అరచేతిని నా నోటిదగ్గరకు తెచ్చింది మూయటానికి.

"నేనామె చేష్టకి కొంచెం నవ్వి "అలాంటిదేమీ కాదు; క్షేమంగానే ఉంది." అని చెబుతూ ఆమె చేతిని నా చేత్తో అడ్డి, మెల్లగా పక్కకినెట్టాను. ఆమెని స్పృశించా నని తెలియగనే ఒళ్ళంతా విద్యుత్తు పరుగులుపెట్టింది. ఇంతటి చనువు నెలా తీసికో గలిగానా అని త్రుటికాలం ఆలోచనలోపడిపోయాను. మాకు కొంచెందూరాన కూర్చొని వున్న ఒక వ్యక్తి మమ్మల్ని క్రీగంట చూస్తూ నవ్వుతున్నాడు. నా కతనిమీద కాకతాళీయంగా కోపం జనించింది. వెనక సీట్లలో కూర్చున్న నడివయస్కుడూ, స్త్రీమూర్తీ అలాగే నావైపు చూస్తున్నారు.

"సంతానమా?" వెంటనే అడిగిందామె.

"ఒక అమ్మాయి."

"అలాగా!" ఆశ్చర్యం ప్రకటించింది.

"ఊఁ!" అన్నాను ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదన్నట్లు.

బస్సు వేగం తగ్గింది. లక్డీకాపుల్ స్టేజీదగ్గర నిలబడబోతుందని గమనించి దిగుదామన్న తలంపుతో పుస్తకాలు చేతపట్టుకుని లేచి నిలుచున్నాను. ఆమెదగ్గరున్న నవలని తీసికోవాలనిపించలేదు. చదువుకుంటుందేమోఉండనీ; అనుకున్నాను. లేచి నిలుచున్న నన్ను ఆమె 'వెళ్ళిపోతున్నారా?' అన్నట్లు దీనంగా చూసింది. బస్సు ఆగింది. కాని నేను దిగలేకపోయాను. ఆమె చూపులు నన్ను కట్టేసినవి. నేను దిగిపోతానని ఆమెకు దిగులుగా ఉన్నట్లుంది. ఆమెతో ఇంకా కొంచెంసేపు మాట్లాడకపోయానే, అనే అసంతృప్తి నాకూ ఉంది పాంటు జేబులోంచి చిల్లర తీస్తూ తిరిగి కూర్చున్నాను ...ఆమె ఎంత దూరం వెళుతుందో అంత పర్యంతమూ వెడదామన్న నిశ్చయంతో.

బస్సు కదిలింది. ఆమె ఎందాకా వెళుతుందో ప్రశ్నిద్దామనుకున్నాను. ఆమెని ప్రశ్నించడం నా అభిమతం కాదు. ఆమె ప్రశ్నలకి జవాబివ్వడం నా విధి. సమీపించిన కండక్టరుకి చిల్లర ఇచ్చి "రాణీగంజ్" టికెట్టు కొన్నాను. బస్సు గమ్యస్థానం అదే. అలాగా ఆమె ఎక్కడ దిగినాసరే, అంతవరకు ఆమె ప్రక్కన కూచుని మాట్లాడుతూ ఆహ్లాదం పొందవచ్చు. వీలు చూసుకుని ఆమె వివరాలు కూడా ఆరాతీయాలి. ఈ సంకల్పంతోనే నేను అలా చేశాను.

ఆమె నన్ను పరిశీలనగా చూసింది. ఆ చూపుల్లో ఒక రకమైన సంతృప్తి గోచరించింది. నావైపునుంచి చూపుల్ని మరల్చుకుని, ఏమీ మాట్లాడకండా పుస్తక ముఖవర్ణాన్ని చూస్తూ తలవంచుకుని మౌనంగా కూచుంది. నిశ్శబ్దం భరించలేకపోతున్నాను. ఆమె ఇక మాట్లాడదేమో! ఆమెనెలా మాట్లాడించడం? మరో మార్గంలేక నేనే సంభాషణ ప్రారంభిద్దామని పెదవులు కదపే స్థితిలో ఉన్నాను. అప్పుడే 'మింట్' అని అరిచాడు కండక్టరు. బస్సు నడక తగ్గించి ఆగింది. మింటుదగ్గర దిగటానికి కొందరు లేచారు. నా వెనకాల ఉన్న ఆ నడివయస్కుడూ, స్త్రీమూర్తి లేచారు. "శచీ, లే, దిగుదాం" అని పిలుస్తూ నా ప్రక్కనున్న కిన్నరకంఠిని భుజం తట్టింది. ఆమె తత్తరపాటుతో నాదగ్గర్నుంచి తీసుకున్న నవలను చేత పట్టుకుని లేచింది.

"ఈ పుస్తక మెక్కడికి? వారిది వారికిచ్చెయ్" అంటూ ఆమె చేతిలోంచి బలవంతాన లాగి నా మీద పడేసింది పెద్దామె.

"అమ్మా, నాకది కావాలి"—ఆక్రందించిందామె, తల్లి ముఖంలోకి నిస్సహాయంగా చూస్తూ.

"నడు." — ఆడ సింహంలా గర్జించింది తల్లి, రెక్క పుచ్చుకుని బలంగా లాగుతూ. ఆమె కదలలేదు.

"నాన్నగారూ!" అని నడివయస్కునితో మొరెట్టుకుంటూ నా దిశకు కోమల హస్తాన్ని చాచింది. తండ్రి సందిగ్ధంలో పడి తచ్చాడుతున్నాడు. వాళ్ళ కూతురిమీద జరుపుతున్న అఘాయిత్యానికి నా గుండె కోతపడింది; ఆమె స్థితిపైన కలిగిన జాలిచేత స్పందించిపోయింది. తక్షణం లేచి పుస్తకాన్ని ఆమె చేతిలో పెట్టాను. ఆమె నన్ను కృతజ్ఞతతో చూస్తూ తల్లిని వెంబడించింది.

కండక్టరూ, బస్సులోని ప్రయాణీకులూ, ఈ దృశ్యాన్ని తిలకిస్తూ కొయ్యబొమ్మల్లా ఉండిపోయారు.

ఆమె తండ్రి నన్ను చూసి, జేబులోంచి ఐదు రూపాయల నోటు తీసి చేతిలో ఉంచుతూ "మరో పుస్తకం కొనండి. కృతజ్ఞుడిని" అన్నాడు.

"అవసరంలేదు; మీరే ఉంచుకోండి. అంత అవసరమైన పుస్తక మేమీ కాదులెండి. వెళ్ళండి" అన్నాను అతని కోటుజేబులో నోటు పెట్టి.

నేను డబ్బు పుచ్చుకోలేదన్న విచారంతో అతను దిగివెళ్ళాడు.

కండక్టరు తను ఉన్న స్థితిలోంచి తేరుకుని బెల్ ఇచ్చాడు. బస్సు కదిలింది.

కిటికీలోంచి బయటికి చూశాను. తల్లిదండ్రులామెను చెరో రెక్క పుచ్చుకుని నడిపించుకుపోతున్నారు. ఆమె కట్టుకున్న తెల్లని చీరకొంగు గాలిలో అలల పోలిక లేచిపోతోంది. ఆమె హంసలా నడిచిపోతోంది.

బస్సు రోడ్డు మలుపు తిరిగింది. వాళ్ళిక అగుపడలేదు. వేడి నిశ్వాసం ఒకటి వదిలాను. బస్సుమీదా, కండక్టరుమీదా ఎందుకో నిష్కారణ

క్రోధం జనించింది. నాకు 'రాణీగంజ్' వెళ్లాల్సిన అవసరం కించిత్ కూడా లేదు. అక్కడే దిగి పోతే బావుండును. త్వరగా ఇంటికైనా చేరు కుందును. కాని నేను కొన్న టికెట్టును వృథా పోనివ్వటానికి మనస్కొడంబడ లేదు.

ఆమె ఎవరై ఉండొచ్చు? నాతో ఎందుకంత సన్నిహితంగా భాషించింది? వాళ్ళు ఆమె తలి దండ్రులే. కాని నాకు వాళ్ళు కూడా పరిచయం లేరు. ఆమె ఒక్కతే నన్ను పరామర్శించడంలో అర్థమేమిటి? నాకు చెల్లాయీ, అన్నా ఇత్యాదు లున్నారని ఆమె కెలా తెలుసు? కనుక్కుందా మన్నంతలోనే వాళ్ళు దిగిపోయారే! అసలీ బస్సు అంత వేగంగా వాళ్ళ స్టేజీని ఎందుకు సమీపిం చాలి? నాదగ్గర మాట్లాడి నా పరిచయం కలుగ జేసుకున్నందుకు ఆమె నా పుస్తకం తీసికెళ్ళింది. నాకేమీ చిహ్నంగా ఇచ్చిపోలేదే? పుస్తకాన్ని పోగొట్టుకోవడమే నాకు చిహ్నంగా మిగిలింది. ఇంకా ఏమిటేమిటో ఆలోచిస్తూ కూర్చున్నాను. నాకు కొంచెం దూరంగా కూర్చున్న ఒక వ్యక్తి లేచివచ్చి నా ప్రక్కన ఆసీనుడై "ఆమె మీకే మవుతుందండీ? ఇప్పుడెలాగుందామెకు?" అని ప్రశ్నించాడు. అతని మొదటి ప్రశ్నకు నేను సమాధానం చెప్పలేను. రెండో ప్రశ్న అసలు అర్థమే కాలేదు. ఆలోచనల్లోంచి తేరుకుని "ఏమిటి?" అని ప్రశ్నించాను.

"ఆమెకిప్పుడు బాగుందా?"—అడిగాడతడు.

ఇది అతడు మొదట వేసిన రెండో ప్రశ్న. మొదటి ప్రశ్నే వేసి ఉంటే ఏం సమాధానం ఇవ్వాలో తెలిసి ఉండేది కాదు. ఈ ప్రశ్నకి కూడా కొంచెం తటపటాయిస్తూ "ఆఁ, బాగుంది." అనేశాను. కాని తదుపరి ఆలోచనలో పడ్డాను. ఆమెకేమైనట్టు? మనిషి చలాకీగా, ఆరోగ్యంగానే ఉంది. ముఖంలో అవంతైనా జబ్బు చిహ్నాలు లేవు.

ఆయన మళ్ళీ మొదటి సవాలు చేస్తాడో ఏమో ననిపించి "మీకామె ఎలా పరిచయం?" అనడిగాను నేనే.

అతను చెప్పనారంభించాడు: "ఇంతకు పూర్వం వీళ్ళ కుటుంబం జాంబాగ్‌లోని మా ఇంటిప్రక్కనే మరో ఇంట్లో అద్దెకుండేది. అమధ్య ఈ అమ్మా యికి పిచ్చెత్తిందన్నారు. కొన్నాళ్ళకి జాల్నా తీసుకు వెళ్ళారు. అంచేత మాకు పరిచయం" అని ముగించాడాయన.

నా కొకవైపు విస్మయమూ, ఒకవైపు జాలీ ఆవరించాయి.

రాణీగంజ్ దగ్గర బస్సు నిలిచింది. అందరూ దిగి ఎవరెవరి పనులమీద వారు వెళిపోతున్నారు. కాని నే నెక్కడికి వెళ్ళాలి? సమాధానం చిక్క లేదు. కొన్న టికెట్టు వృథాపోతుందని అంతదాకా వెళ్ళాను. కాని అక్కణ్ణుంచి ఇంటికి వెళ్ళడానికి మళ్ళీ డబ్బులు అవసరం! ఈ విషయం మొదట స్ఫురించనేలేదు. నా బుద్ధిమాంద్యంపై నాకే సిగ్గేసింది.

కొంచెం అటూ ఇటూ మసలి తిరిగి వచ్చి, అదేబస్సులో ఎక్కాను. బస్సు వేగంగా వెడు తోంది హుసేన్ సాగరం కట్టమీదుగా. నేను యోచిస్తున్నాను. ఆమె పిచ్చిదా? సందేహం. కాదు. అంతమంచిగా, మర్యాదగా మాట్లాడింది. నా సంబంధీకుల సంక్షేమాలన్నీ కనుక్కుంది. ఆమె పిచ్చిదెలా అవుతుంది? కావచ్చు. ముఖపరిచయమైనా లేని నాతో అంత చనువుగా మాట్లాడడమే పిచ్చివాళ్ళపని కాకపోతే మరెవరిది? ఆమె పిచ్చిది. మంకుపట్టుగల పిచ్చిది. అంచేతనే వాళ్ళమ్మ అలా గర్జించింది. ఆమె పిచ్చిది కనుకనే వాళ్ళ నాన్న నాకు ఐదురూపాయల నోటు పుస్తకానికి బదులుగా ఇవ్వొచ్చాడు. పాపం! ఆమె అంత అందంగా ఉంది. ఆమెకు పిచ్చి ఆవేశించడం భగవంతుని ప్రకృతిలో ఒక వికృతి. దేవుడు మూర్ఖుడు. క్రూరుడు.

క్రమంగా నా ఆలోచనలకి కూడా ఆవేశం జనిస్తోంది.

ఆమె ఎందుకు పిచ్చిదై ఉంటుందా? మనుష్యులకి పిచ్చెత్తటానికి అనేక కారణాలుంటాయి. పిచ్చి కుక్క కాటువలన పిచ్చివాళ్ళైనవారు చాలా మంది ఉన్నారు. ఐతే ఇలా పిచ్చివాళ్ళవడానికి మానసికమైన కారణాలు ప్రబలంగా ఉంటాయట. మానసిక శాస్త్ర సంబంధ విజ్ఞానాన్ని నేనట్టే ఆక ళించుకోలేదు. ఐనా కొంతవరకు ఆలోచించగలుగు తాను. ఆమెకు ఇతరులతో సాన్నిహిత్యంగా మాట్లాడాలంటే సరదా కావచ్చు. తలిదండ్రులు

అందుకు ఒప్పుకోక ఆమెకు నిర్బంధం చేసిఉండొచ్చు. ఇదొక కారణం. మరో కారణం, ఆమెకు ఎప్పుడూ క్షేమకరమైన సంతోషవార్తలు వినాలని ఉంటుంది కాబోలు! అందరూ విషాద సమాచారాలని వినిపించి ఆమె కోమల హృదయాన్ని గాయపరచి ఉంటారు. అంచేత ఆమె పిచ్చిదైంది. నేను అన్నీ మరణవార్తలే చెబితే ఆమె ఎంత బాధపడింది! మూడో కారణం ఏదేనా ఉండొచ్చునా? ఆఁ, నే పరీక్షించినంతవరకూ మరో కారణంకూడా ఉంది. ఆమెకు నవలలు చదవడం ఇష్టం. ఎవరూ వాటిని ముట్టనివ్వకుండొచ్చు—నవలలు చదివితే మనుషులు చెడిపోతారని కొందరిలో ప్రాకిపోయిన నమ్మకం ఆధారంగా. ఏమో! ఆమె నవలలు చదివే అలా మారిందేమో! బాగా నవలలు చదివినవాళ్ళు పిచ్చివాళ్ళయారు—ఇంతకంటే బలమైన కారణాలు నాకేమీ కన్పించలేదు. సైకాలజిస్టులు ఎవరైనా చెబుతారేమో తెలీదు. కాని ఆమెకు నిజంగా పిచ్చి ఉంటే కుదిరితే బావుండు ననిపిస్తోంది. అంతటి అందమైన స్త్రీకి పిచ్చి ఉండటం క్రూరం!

ఇంకా ఏమేమో ఆలోచించుకుంటూ బస్సు దిగి ఇంటికి నడిచాను. అనవసరంగా రాణీగంజ్ వెళ్ళి తిరిగిరావడానికి డబ్బు వృథాచెయ్యడం తలచుకుంటే ఆమె పిచ్చి నాకుగాని తిరుగలేదు కదా అనిపించింది.

---

స్కెచ్

# సహజీవన సార్థక్యం

"రత్నం"

హనుమంతుడికి ఇంకొకళ్ళు చెప్పేదాకా తన శక్తి తనకు తెలిసేదికాదని అంటారు. అంతటివాడు కాకపోయినా అంజనేయుల్లోనూ ఆ లక్షణాలు వంశపారంపర్యంగా వచ్చినవి. పొయ్యూదుకునే బొంగుకూ, కూర్చునే కుర్చీకీ కంసాలి యొందుకంటాడు; బిందెమీదికి ప్రాకి మంచినీళ్ళలో మట్టిపోస్తున్న కొడుకు చిలిపితనాన్ని మనస్తత్వ శాస్త్రరీత్యా పరిశీలిస్తూ చూస్తూ కూర్చుంటాడు! బాగా పాడే గ్రాంఫోను, రేడియోల్ని చెడగొట్టి మళ్ళీ బాగుచేస్తుంటాడు. ఎప్పుడూ దానికి చీల బిగించటమో, దీన్ని ఉలితో చెక్కటమో, బైండు పనిచేయటమో...ఊరికే కూర్చోడు.

సృష్టిలో కన్పించే ప్రతీదీ అతని కొశ్చన్ మార్కుకు గురిఅయ్యేదే! 'ఇది గొప్పవాడి లక్షణం' అని స్నేహితులు మెచ్చుకునేదాకా తన మేధాశక్తిని తెలుసుకోనేవాడు కాదు ఆంజనేయులు. ఇంతకీ అతడు ఓ పల్లెటూళ్ళో బడిపంతులు. స్నేహితులంతా నాగరికంగా 'అంజీ...!' అని పిలుస్తారు ముద్దుగా.

"మీ నాన్న భలే తెలివిగలవాడురా!" దేనికో మేకులు కొడుతూ—పీకుతున్న అంజితో అన్నాడు శర్మ.

"ఆ తెలివితేటలు మనకు జన్మతో వస్తాయా! మెలికవేశాడంటే వ్యవహారం గిర్రున తిరిగి రావాల్సిందే! అంతటి లౌక్యంగల మనిషి. నలుగురిచేతా భళీ భళీ! అనిపించుకున్న మనిషి..."—పరధ్యానంగా అంజి చెప్పుకుపోతున్నాడు తన తండ్రిని గురించి, స్నేహితుల కళ్ళల్లో పరిహాసం గుర్తించక.

"ఏది ఎలా ఉన్నా కొడుకుపేరు మాత్రం తగినట్టు పెట్టేడురా!" ఆపుకోలేక పకపకా నవ్వేశారు శర్మా, చుట్టూ కూర్చున్న స్నేహితులూ.

ఉలిక్కిపడ్డాడు అంజనేయులు. "ఏడ్చారు లేరా, ఇందుకా అడిగింది!" గ్రహించినట్టు తనూ వాళ్ళతోపాటు నవ్వేడు.

చాలారోజులకు స్నేహితుల్తోపాటు పరిహాసం పంచుకొన్నాడు ఆంజనేయులు. నిన్నటిదాకా దీక్షబట్టినట్టు మూరెడు పొడుగు గడ్డం పెంచి ప్రతిజ్ఞ నెరవేరిందాకా అన్నం ముట్టనని దగ్గరున్న